క్లుప్తంగా

విధుల పట్ల అలసత్వం వద్దు



ఎంఎస్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: విధుల పట్ల అలసత్వం వహించకుండా సక్రమంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం స్థానిక సోమప్ప నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలను పరిశీలించారు. సంతకాలు చేయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించాలని, విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంధిరన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగి విద్యార్థులు ఆగస్టు 10వ తేదీలోపు https://cbseitms.rcil.gov.in/nvs వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని 20-1-2024న ప్రవేశపరీక్ష ఉంటుందని చెప్పారు.

జగనన్న సురక్ష పకడ్బందీగా చేపట్టాలి

నందవరం: గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల సేవలు విస్తృతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో అర్హత ఉండి రైస్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ తదితర సమస్యలపై లబ్ధిదారులతో చర్చించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయం ద్వారా 7 రోజుల్లో అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీసీల కోసం డబ్బు వసూలు

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యర్థులు టీసీల కోసం వెళితే పట్టణంలోని కొన్ని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు డబ్బులు వసూలు చేస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు ఆరోపించారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీటీ ఎజాజ్‌అహ్మద్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. టీసీల కోసం విద్యార్థులు పాఠశాలలకు వెళితే టీసీ బుక్కులు లేవని తిప్పుకుంటూ ఒక్కో టీసీకి రూ.200 నుంచి రూ.300 వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ పేర్కొన్నారు.స్థానిక గ్రామ సచివాలయం-2 ఆధ్వర్యంలో మంగళవారం వైద్యాధికారులు మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు టీకాలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించి, వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సంతేకూడ్లూరు

హొళగుంద: ఇంగళదహాల్ గ్రామంలో నిర్వహించిన కేసీ తిమ్మారెడ్డి మెమోరియల్ డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఆదోని మండలం సంతేకూడ్లూరు జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇంగళదహాళ్ కేసీటీఆర్ జట్టుపై సంతేకూడ్లూరు జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.25 వేలు నగదుతో పాటు, షీల్డ్‌లను నిర్వాహకులు వీరభద్రారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, గ్రామపెద్దలు రంగారెడ్డి, రాజారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మద్దికెర: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, వైకేపీ ఏపీఎం మధుబాబు సూచించారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆయా పథకాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పొదుపు రుణాలు సకాలంలో చెల్లించి సంఘాల బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఏఓ రవి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

- గ్రామాల్లో దీర్ఘకాలిక రోగుల పట్ల శ్రీరామరక్షగా ఫ్యామిలీ డాక్టర్ విధానం
- ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్న వైద్య సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చిప్పగిరి: మనిషి ఆరోగ్యంగా ఉంటే జీవితంలో సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్టే. మానవ జీవితానికి ఎంతో ప్రాముఖ్యమైనది ఆరోగ్యం. ఆర్థిక స్థితిగతుల కారణంగా నిరుపేదలు అనారోగ్యం పాలైతే ప్రాణాలు పోగొట్టుకొనే పరిస్థితులు గత ప్రభుత్వాల పాలనలో ఉండేవి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నిరుపేదల ఆరోగ్య రక్షణకు అనేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చి ప్రతి గ్రామంలో ప్రజల ఇంటి ముంగిటకే తేవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని 13 గ్రామ పంచాయతీలు 3 మజారా గ్రామాలతో కలిపి మొత్తం 16 గ్రామాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ (ఫైల్)

ఉన్నాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు జామీల్ అహ్మద్, పార్వతి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఒకరు స్థానిక పీహెచ్‌సీలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తే ఒకరు నిత్యం 104 వాహనం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. ఇందులో ముఖ్యంగా హెచ్ బీ, బ్లడ్ గ్రూప్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, వీడీఆర్ఎల్, ఆర్‌బీఎస్, గర్భనిర్ధారణ, యూరిన్, షుగర్, తదితర టెస్ట్‌ల తో కలిపి సుమారు 46 రకాల పరీక్షలు చేస్తారు. జబ్బును బట్టి మందులు ఇస్తారు. దీనికి తోడు చిప్పగిరి, బెల్డోణ, డేగులహాలు, దౌల్తాపురం, గుమ్మనూరు, నగరడోణ, నేమకల్, రామదుర్గం, ఏరూరు మొత్తం 9 గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు, వైద్య రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాముఖ్యతపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రోజూ ఒక గ్రామంలో వైద్య సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి రోజు ఒక గ్రామానికి వెళ్లి సేవలందిస్తారు. ముఖ్యంగా మంచాన ఉన్న రోగుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి మందులు అందిస్తారు. అలాగే అంగన్‌వాడీ కేంద్ర సందర్శన, పాఠశాలలో వైద్య కార్యక్రమం, అసంక్రమిత వ్యాధులకు పరీక్షలు, చికిత్స, రక్తహీనత పరీక్షలు, చికిత్స, ప్రసూతి ఆరోగ్య సంరక్షణ సేవలు, బాలింతల ఆరోగ్య సంరక్షణతో పాటు సాధారణ వైద్య సేవలు అందిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– జమీల్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్

మారుమూల ప్రాంతాలకు చాలా ఉపయోగం



ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల మండల కేంద్రానికి దూరంగా ఉన్న మారుమూల గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగం. ఇకపై ఆయా గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– భీమ, నంచర్ల గ్రామం

'జగనన్న సురక్ష' షెడ్యూల్ ఖరారు

వెల్దుర్తి: మండలవ్యాప్తంగా జూలై 1 నుంచి 25వ తేదీ వరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ఏదైనా ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే గుర్తించి, త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెండు బృందాలు విడివిడిగా జూలై 1న గోవర్ధనగిరి- 1, 2 సచివాలయాలు, 4న బింగిదొడ్డి, 5న బొమ్మిరెడ్డిపల్లె, 6న లక్ష్మీనగరం, 7న చెరుకులపాడు, 11న కలుగొట్ల -1, 2, 13న మదార్‌పురం (సూదేపల్లె), 14న మల్లెపల్లె, 15న పుల్లగుమ్మి, 18న సర్పాపురం, 19న రామళ్లకోట, 20న రత్నపల్లె, 21న వెల్దుర్తి-2, 22న శ్రీరంగాపురం, 25న వెల్దుర్తి-1, 3 సచివాలయాల పరిధిలో ఇళ్ల సందర్శనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

మద్దికెర: మండలంలో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. 1న బసినేపల్లి, 4న బురుజుల, 6న ఎం.అగ్రహారం, 11న హంప, 13న పెరవలి, 18న మద్దికెర-1, 20న మద్దికెర -2, 25న మద్దికెర-3, 27న మద్దికెర-4 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

చేనేతలకు అండగా జగనన్న

ఎమ్మిగనూరుటౌన్: నేత వృత్తిని నమ్ముకున్న చేనేతలను ఆదుకునేందుకు మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయం అందిస్తూ పూర్వవైభవం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేనేతలు అధికంగా నివసిస్తున్న పట్టణంలోని 31వ వార్డు ఎంఎస్ నగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ పురుషోత్తం, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధి, నేతన్న నేస్తం పథకంతో చేకూరుతున్న ప్రయోజనాలను చేనేతలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి



ఎమ్మిగనూరు 31వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, నజీర్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఆలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఐక్యతతో కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ సూచించారు. ఆయన మంగళవారం హాలహర్వి మండలం కొక్కెరచేడు గ్రామంలో కొలువైన శ్రీ మౌలాలి స్వామి దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ బోయ నెట్టికంతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైస్ ఎంపీపీ నగేష్, మండల కన్వీనర్ భీమప్ప తదితరులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన బోధన

మద్దికెర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పించి పూర్వ ప్రాథమిక విద్య నేర్పిస్తున్నారని సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేంద్రంలో చిన్న పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రీస్కూల్‌లో చిన్నారులకు ఆటల పాటలతో అక్షరాలు నేర్పిస్తామన్నారు. అలాగే పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తారని, మూడేళ్లు నిండిన పిల్లలను ప్రీస్కూల్‌లో చేర్పించాలని కోరారు.

ఎంఈఓ-2ల బాధ్యతల స్వీకరణ




గాజుల రమేష్, పత్తికొండ కే.గోపాల్, మద్దికెర

పత్తికొండ రూరల్: మండల విద్యాధికారి-2గా గాజుల రమేష్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. హోసూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న గాజుల రమేష్‌ను ఎంఈఓ-2గా నియమిస్తూ జిల్లా విద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంఈఓ మస్తాన్‌వలి సమక్షంలో విధుల్లో చేరారు.

మద్దికెర: మండల ఎంఈఓ-2గా కే.గోపాల్ బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. ఈయన కై రుప్పల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించేవారని పదోన్నతిపై బదిలీ పొంది వచ్చినట్లు తెలిపారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి

ఆలూరు రూరల్: పాఠశాలల అధునీకరణలో భాగంగా జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఆలూరు ఎంఈఓ రామాంజినేయులు ఆదేశించారు. ఆయన మంగళవారం కోయనగర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో రెండో విడత నాడు-నేడు పనులు 24 పాఠశాలల్లో రూ.13 కోట్లతో జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలతో పాఠశాలల పునరుద్ధరణ పనులు చేయాలని హెచ్‌ఎంలకు సూచించామన్నారు.

జల చౌర్యానికి పాల్పడితే చర్యలు

చిప్పగిరి: ఏబీసీ కెనాల్ కింద నాన్ ఆయకట్టు రైతులు జల చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఈ మంజునాథ్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దారు లక్ష్మినారాయణ, డీఈ మంజునాథ్, పలువురు అదికారులతో కూడిన బృందం ఏబీసీ కెనాల్ లైన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు జూటూరు మారయ్య ఆధ్వర్యంలో పలువురు రైతులు ఏబీసీ కెనాల్ కింద నాన్ ఆయకట్టు రైతులు కొందరు అక్రమంగా నీటిని మోటార్ల ద్వారా తోడుకుంటూ జల చౌర్యానికి పాల్పడుతున్నారని, వారిని అరికట్టాలని అదికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన అధికారులు అక్రమంగా కాలువపై ఉంచిన మోటార్లను వెంటనే తొలగిస్తామని వారికి హామీ ఇచ్చారు. డేగులహాలు సర్పంచ్ నీలకంఠ, రైతులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఆలూరు: క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని ఏపీడీ పక్కీరప్ప ఆదేశించారు. ఆయన మంగళవారం ఆలూరు మండలంలోని అరికెర గ్రామంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ ఉదయం 7.30 గంటలకల్లా పనులకు వచ్చి 12 గంటల్లోపు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఎండ నుంచి రక్షణ పొందేలా తలపై టవల్ చుట్టుకోవాలని, తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం రోజూ 3,400 మంది కూలీలు పనులకు వస్తున్నారని, కూలీల సంఖ్య మరో 500 పెంచేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీడీ వెంట టీసీ, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపండి

వెల్దుర్తి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వీడాలని, ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం ప్రారంభించేలా చూడాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఈ నాగరాజు, డీఈఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్‌తో కలిసి ఇళ్ల లబ్ధిదారులు, హౌసింగ్ శాఖ మండల అధికారులు, సిబ్బంది, పీఆర్ ఈఏలతో సమావేశమయ్యారు. గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరవుతున్నాయని, కాలనీల్లో నీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించామని, నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. థర్డ్ పార్టీతో నిర్మాణాలు సైతం ప్రారంభించేలా



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణ విషయంలో సమస్యలుంటే తమను సంప్రదించాలని కోరారు.ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే పట్టా రద్దవుతుందనే విషయాన్ని లబ్ధిదారులు గుర్తించాలన్నారు. హౌసింగ్ ఏఈ అరవింద్, సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి




రాంపల్లి క్రాస్ రోడ్డులోని హోటల్‌లో బజ్జీలు కాలుస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

తుగ్గలి: నిత్యం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాంపల్లిలో మంగళవారం రెండో రోజు నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ముగిసింది. పార్టీ నాయకులు బోగోలు నాగభూషణరెడ్డి, జూటూరు రాజు, కోటేశ్వర రెడ్డి, సర్పంచ్ మనీంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మిదేవితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు తాగునీరు, డ్రైనేజీలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మట్లాడుతూ.. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు. మోసపూరిత హామీలతో చంద్రబాబు మరోసారి కుట్ర చేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా క్రాస్ రోడ్డులో ఓ హోటల్‌లో ఎమ్మెల్యే బజ్జీలు వేశారు. అనంతరం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతులు మారెల్ల తలారి సుంకన్న, రామలింగాయపల్లి అంగడి ఈశ్వరయ్య కుటుంబాలకు రూ.7 లక్షల చెక్కులను అందజేశారు. ఎంపీడీఓ సావిత్రి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు నాగేష్, రామచంద్రారెడ్డి, హుసేన్, మోహన్‌రెడ్డి, మెహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న వెంకటరమణను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి రంగారెడ్డి మంగళవారం వెల్లడించారు. టీచర్ రమణ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కను చంపి తిన్న చిరుత?

ఆస్పరి: ములుగుందం గ్రామ సమీపంలోని జంగరాళ్ల కొండల్లో మంగళవారం చిరుత దాడి చేసి చంపిన స్థితిలో కుక్క కళేబరం కనిపించింది. కొండల్లో ఉంటున్న జింకలను వేటాడేందు కు కుక్కలు వెళ్తాయని, ఆ సమయంలోనే చిరు త దాడి ఉంటుందని గ్రామస్తులు నరసింహు లు, రాముడు, తిక్క య్య తెలిపారు. కుక్కను వేటాడి సమీపంలోని పొదల్లోకి ఈడ్చికెళ్లి కొంత భాగం తినేసి వదిలివెళ్లింది. కొండ పక్కనున్న పొలాలకు వెళ్లిన రైతులు, ఉపాధి కూలీలు పొదల మధ్య ఉన్న కుక్క కళేబరాన్ని చూసి ఆందోళన చెందారు. ఫారెస్టు అధికారులు చిరుతను బంధించి మరోచోటికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పకడ్బందీగా సోషల్ ఆడిట్

వెల్దుర్తి: మండలంలో ఉపాధి పనులు నిబంధనల మేరకే జరిగాయని, ప్రస్తుతం జరుగనున్న పనుల్లో సైతం అక్రమాలకు తావివ్వమని ఎంపీడీఓ/పీఓ శ్రీనివాసరావ్, ఏపీఓ రాజునాయక్ పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బంది పకడ్బందీగా ప్రతి పనిని పరిశీలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం వారు ఉపాధి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం రామళ్లకోట గ్రామ సభలో వైరి వర్గాలు వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేసుకున్నారని, ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని వస్తున్న పుకార్లు సరికాదన్నా రు. సోషల్ ఆడిట్‌లో భాగంగా ప్రతి పనికి విచారణ జరుగుతోందని, చేసిన పనులు, చేసిన వారిని సైతం ఆడిట్ సిబ్బంది విచారిస్తున్నారన్నారు. ఇప్పటివరకు జరిపిన ఆడిట్‌లో కేవలం కూలీల సంతకాల తేడాలు, కొలతల్లో స్వల్ప తేడాలు బయటపడ్డట్లు తెలుస్తోందన్నారు. గ్రామసభలలో ప్రతి ఒక్కరి అభిప్రాయాలు నమోదు చేసుకుంటామని, ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

కృష్ణగిరి: గ్రామాల్లో నీటి వసతి కలిగిన రైతులు పండ్ల తోటల సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాల్లో గుంతలు తవ్వించి మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం కింద మామిడి, సపోట, చినీ మొక్కలు పెంచుకునేందుకు రైతుల జాబితాను సిద్ధం చేశామన్నారు. ఈ నెల చివరికల్లా అందరూ మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రైం కార్నర్

బాలికపై అత్యాచారయత్నం



బాలికకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేస్తున్న గంజిహళ్లి గ్రామస్తులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో సోమవారం రాత్రి 13 ఏళ్ల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి యత్నించినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు.. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిందితుడి భార్య సోమవారం రాత్రి మైనర్ బాలికను బహిర్భూమికి వెళదామని పిలిచింది. నమ్మి బాలిక వెంటవెళ్లగా అక్కడ చెట్ల మాటున్న ఉన్న వ్యక్తి వచ్చి బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా ఆ వ్యక్తి పరారయ్యాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య, భర్తపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బాలికకు న్యాయం చేయాలి

మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తి, అతనికి సహకరించిన భార్యను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గంజిహళ్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలిక కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. సుమారు అరగంట సేపు ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ తిమ్మారెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించుకున్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

వెల్దుర్తి: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న పరమేశ్, అయ్యస్వామి, జంబన్నలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తాము జరిపిన సోదాల్లో నిందితుల వద్ద నుంచి మట్కా చీటీలతోపాటు 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామానికి చెందిన దొడ్డి ధనుంజయ మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామంలోనే పాల వ్యాపారం చేసుకుంటూ దంపతులు జీవనం కొనసాగిస్తున్నారు. గత కొన్నాళ్ల నుంచి భార్యభర్తలు, కుటుంబ సభ్యుల మధ్యన నెలకొన్న విబేధాలు, మనస్పర్థలతో గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సనందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

కోలుకోలేక వివాహిత మృతి



మృతి చెందిన బోయ పూజిత (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బోయ పూజిత (20) మంగళవారం మృతి చెందింది. రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గుడేకల్‌కు చెందిన మల్లికార్జున భార్య పూజిత కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ కారణంగానే పిల్లలు పుట్టలేదనే మనస్తాపంతో ఈ నెల 16న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలు తల్లి శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా ఊట ధ్వంసం

వెల్దుర్తి: ఎల్.బండ తండా పరిధిలోని కొండల్లో నాటు సారాబట్టీలపైమంగళవారం తెల్లవారుజామున ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఒక చోట సారాబట్టిని గుర్తించి దాదాపు 500 లీటర్ల బెల్లం ఊటధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సారాబట్టీనిర్వాహకుడు ఎవరన్నది విచారిస్తున్నట్లు తెలిపారు.


వడదెబ్బతో వ్యక్తి మృతి



చాంద్‌బాషా (ఫైల్)

పత్తికొండ రూరల్: పత్తికొండలోని తేరుబజారులోఎస్.చాంద్‌బాషా (62) వడదెబ్బతో మంగళవా రం మృతి చెందినట్లు కు టుంబ సభ్యులు తెలిపా రు.తేరుబజారులోఏ చిన్న వస్తువు కొనాలన్నా మసీ దు పక్కనున్న చాంద్‌బాషా దుకాణానికి వెళ్లాల్సిందే.చాంద్‌బాషా భార్య గౌసియాబేగంకు అనారో గ్యంగా ఉండటంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని తిరిగి పత్తికొండలోని ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పురుగు మందు తాగి బలవన్మరణం



లక్ష్మన్న (ఫైల్)

నందవరం: స్థానిక ఎస్సీ కాలనీలో పరంపోగు లక్ష్మన్న అలియాస్ అనోక్ (28) మంగళవారం పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు.. గత కొంతకాలంగా అనోక్ మానసిక స్థితి సరిగ్గా లేక డాక్టర్ల వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున తల్లి రంగమ్మ నిద్ర లేచి చూడగా అనోక్ నోటి నుంచి నురగరావడం, పురుగు మందు వాసన వస్తుండడంతో కుటుంబ సభ్యులకు తెలిపింది. అప్పటికే అనోక్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి అన్న రామన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు.